క్లుప్తంగా

ఆంధ్రా షిర్డీసాయి ఆలయ వార్షికోత్సవం



ఆంధ్రా షిర్డీ సాయిబాబాకు క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి

బిక్కవోలు: బలభద్రపురంలో కొలువైన ఆంధ్రా షిర్డీసాయిబాబా ఆలయ 18వ వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. బాబావారి మూలవిరాట్‌కు 108 లీటర్ల ఆవు పాలతో అభిషేకం చేశారు. మధ్యాహ్నం కోలాటంతో రథోత్సవం నిర్వహించారు. ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వారిని దుశ్శాలువాతో కమిటీ సభ్యులు సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి కృషి చేస్తున్న వ్యవస్థాపక అధ్యక్షుడు పురుషోత్తమరెడ్డి, ఆలయ కమిటీ సభ్యులను అభినందించారు. రాష్ట్ర పౌల్ట్రీ ఫెడరేషన్ అధ్యక్షుడు కర్రి ముకుందరెడ్డి, కేపీఆర్ సంస్థల చైర్మన్ కొవ్వూరి పాపారెడ్డి, ప్రారిశామిక వేత్త చింతా పాండురంగారెడ్డి తదితరులు పూజలు చేశారు.

అనపర్తి: మహేంద్రవాడలో సత్తెమ్మ తల్లి ఆలయ 18వ వార్షికోత్సవాన్ని శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఆ గ్రామంలోని బోర్డు పొలంలో వేంచేసి ఉన్న అమ్మవారిని సబ్బెళ్లవారి వంశస్తులు శతాబ్దాలుగా ఆరాధ్య దైవంగా కొలుస్తున్నారు. ఆలయ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి పాల్గొన్నారు. సర్పంచ్, ఉప సర్పంచ్‌లు మల్లిడి జయప్రభ గంగరాజు, సొసైటీ అధ్యక్షుడు జట్లారెడ్డిగారి అబ్బు, సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

పైప్‌లైన్ శుభ్రతా పనులు

బిక్కవోలు: ఊలపల్లి గ్రామంలో తాగునీటి పైపులైన్ శుభ్రతా పనులు శుక్రవారం చేపట్టారు. పైప్‌లైన్‌లో మట్టి పేరుకుపోవడంతో నీరు రావడం లేదు. ఫైజర్ యంత్రం సాయంతో దానిని క్లీనింగ్ చేయించారు. ఈ పనులను సర్పంచ్ బండారు రమ్య పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ పంచాయతీ నిధులు సుమారు రూ.30 వేలతో ఈ పనులు చేస్తున్నామన్నారు. ఎంపీటీసీ సభ్యులు బండారు శివ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పోతుల ప్రసాద్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ పాల్గొన్నారు.

నగర పాలక సంస్థతో 'నన్నయ' ఒడంబడిక

రాజానగరం: రాజమహేంద్రవరం నగరపాలక సంస్థతో ఆదికవి నన్నయ యూనివర్సిటీ అవగాహన ఒడంబడిక చేసుకుంది. ఇందుకు సంబంధించిన పత్రాలపై వీసీ ఇన్‌చార్జి ఆచార్య జీవీఆర్ ప్రసాదరాజు, రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, మున్సిపల్ కమిషనర్ దినేష్‌కుమార్ శుక్రవారం సంతకాలు చేసి, పరస్పరం మార్చుకున్నారు. కార్పొరేషన్ పరిధిలోని వేస్ట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌లో సాంకేతిక పరిజ్ఞానం, నైపుణ్యాల కోసమే ఈ ఒప్పందమని కమిషనర్ తెలిపారు. ప్రజారోగ్యం, పారిశుద్ధ్యం, ఘన, ద్రవ వ్యర్థాలపై నిపుణుల సలహాలు ఎంతో అవసరమన్నారు.

వ్యక్తిపై కర్రలతో దాడి

గోకవరం: వ్యక్తిపై ముగ్గురు వ్యక్తులు దాడి చేసిన ఘటనపై కేసు నమోదు చేసినట్టు స్థానిక ఏఎస్సై శ్రీనివాస్‌రావు శుక్రవారం తెలిపారు. వివరాల్లోకి వెళితే..కృష్ణునిపాలెం పంచాయతీ పరిధిలోని రామన్నపాలెం గ్రామానికి చెందిన అండిబోయిన గోవిందరాజు శుక్రవారం మధ్యాహ్నం బైక్‌పై కృష్ణునిపాలెం వెళుతుండగా అదే గ్రామానికి చెందిన పీతా సత్యనారాయణ, దొడ్డి రాజేష్, మరొక వ్యక్తి కలిసి బైక్‌పై వచ్చి గోవిందరాజును అడ్డగించి వారి వెంట తెచ్చుకున్న కర్రలతో తలపై తీవ్రంగా కొట్టి గాయపరిచారు. తీవ్రంగా గాయపడిన గోవిందరాజు తొలుత గోకవరం ప్రభుత్వాస్పత్రికి తరలించగా ప్రథమ చికిత్స అందించిన మెరుగైన వైద్యం నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ఆయుర్వేద వైద్యుడికి సత్కారం

మధురపూడి: గాడాలలో ఆయుర్వేద వైద్యుడు జమాల్‌ఖాన్‌ను శుక్రవారం వీరభద్రస్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సత్కరించారు. చింతూరు మండలం నిమ్మలగూడెంకు చెందిన ఆయన ప్రతినెలా గాడాలలో వైద్యశిబిరం నిర్వహిస్తున్నారు.

ఉపాధి కూలీల ధర్నా

రాజానగరం: పని సమయంలో ఇబ్బంది పెట్టడంతో పాటు కూలిని కాజేస్తున్న సూపర్ వైజర్, అతడి సహాయకుడిని తక్షణమే మార్చాలని డిమాండ్ చేస్తూ నందరాడకు చెందిన ఉపాధి హామీ పథకం కూలీలు డిమాండ్ చేశారు. వారు మాట్లాడుతూ ఉపాధి సూపర్ వైజర్ దారా శ్రీను తాము ఉదయం 7.30 గంటలకు పనికి వెళ్తే అరగంట ఆలస్యంగా వచ్చారంటూ ఇష్టానుసారంగా మాట్లాడారన్నారు. మస్తరు వేయడంలో మతలబు చేస్తూ అతడి సహాయకుడు వెలుసు గంగరాజుతో కలిసి తమ కూలిని కూడా కాజేస్తున్నారని ఆరోపించారు. ఈ మేరకు మాజీ ఎంపీటీసీ సభ్యుడు అడుసుమిల్లి హరికృష్ణ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద శుక్రవారం ధర్నాకు దిగారు. వైఎస్సార్‌సీపీ నాయకులు ఉదయ్, జిలానీ సర్దిచెప్పే ప్రయత్నం చేసినా కూలీలు పట్టువీడలేదు. ఈ విషయంపై ఎన్ఆర్ఈజీఎస్ ఏపీఓ అగస్టీన్ కుమార్‌ని వివరణ కోరగా శనివారం వాస్తవాలు తెలుసుకుని చర్యలు తీసుకుంటామన్నారు.

శివరాత్రి ఉత్సవాలకు శైవక్షేత్రాలు సిద్ధం

- మహా శివరాత్రి ఉత్సవాలకు సర్వం సిద్ధం
- ముస్తాబైన శివాలయాలు

రాజానగరం: శివరాత్రి ఉత్సవాలకు నియోజకవర్గంలోని శైవక్షేత్రాలు సిద్ధమయ్యాయి. ఈ మేరకు ఆలయాలను అందంగా ముస్తాబు చేశారు. రాజానగరం, కోరుకొండ, సీతానగరం మండలాల్లోని పలు గ్రామాల నుంచి భక్తులు శుక్రవారం అర్ధరాత్రి నుంచే గోదావరిలో స్నానాలు ఆచరించి, వేకువజామునే సమీపంలోని శివాలయాలను దర్శించుకుంటారు. రాజానగరంలోని రాజలింగేశ్వరస్వామి, రాజగోపాలస్వామి ఆలయాలను సుమారు 300 ఏళ్ల క్రితం రాజమహేంద్రవరానికి చెందిన రాజా కాండ్రేగుల జోగి జగన్నాథరావు బహదూర్ పంతులు నిర్మించారు. దివాన్‌చెరువు ఆగమ ఆశ్రమంలోని కాశీ అన్నపూర్ణ, విశాలాక్షి సమేత కాశీవిశ్వేశ్వర స్వామి, జాతీయ రహదారిని ఆనుకుని నరేంద్రపురం జంక్షన్ వైపు ఉన్న ఈతచెట్టు ఈశ్వరుడు, తూర్పుగానుగూడెం, పల్లకడియం, నందరాడ, నరేంద్రపురం, జి.యర్రంపాలెం, కానవరం, సంపత్‌నగరం గ్రామాల్లో శైవ ఆలయాల్లో శివరాత్రి వేడుకలు జరుగనున్నాయి.

సీతానగరం మండలంలో..


సీతానగరం: స్థానిక ఉమా రామలింగేశ్వరస్వామి, ముగ్గళ్లలోని ఉమా కొమరేశ్వరస్వామి, మునికూడలిలోని ఉమా సోమేశ్వరస్వామి, కాటవరంలోని శివాలయాలను విద్యుద్దీపాలతో అలంకరించారు. ఉదయం నుంచి పురుషోత్తపట్నం, రామచంద్రపురం, వంగలపూడి, సింగవరం, సీతానగరం, రఘుదేవపురం, ముగ్గళ్ల, మునికూడలి, బొబ్బిల్లంక గ్రామాల వద్ద రేవులలో భక్తులు పుణ్యస్నానాలాచరించి, ఆయా గ్రామాల శివాలయాల్లో స్వామి వారిని దర్శించుకుంటారు.

కోరుకొండ మండలంలో..

మధురపూడి: కణుపూరులోని భ్రమరాంబికా సహిత మల్లికార్జునస్వామి కల్యాణోత్సవాలు శనివారం నుంచి ఈనెల 22వ వతేదీ వరకూ నిర్వహించనున్నారు. కాపవరంలోనిఅన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి, బూరుగుపూడిలోని వీరేశ్వర స్వామి ఆలయాల్లో ఉత్సవాలు జరుగుతాయి.



రాజానగరంలోని రాజలింగేశ్వరస్వామి, రాజగోపాలస్వామి ఆలయాలు



కణుపూరులోని భ్రమరాంబికా సహిత మల్లికార్జునస్వామి ఆలయం



రంగంపేటలో ఉమా రామలింగేశ్వరస్వామి దేవాలయం



బిక్కవోలులో గోలింగేశ్వరస్వామి



ఊలపల్లిలో అగస్త్యేశ్వరస్వామి



అనపర్తి శివాలయం వద్ద విద్యుత్ దీపాలంకరణ

శివ పూజకు వేళాయే..

బిక్కవోలు: శివ పూజకు వేళయ్యింది.. పరమ శివుడిని భక్తిశ్రద్ధలతో కొలిచేందుకు సర్వం సన్నద్ధమైంది.. శనివారం జరిగే మహా శివరాత్రి ఉత్సవాలకు అనపర్తి నియోజకవర్గంలో ఆలయాలు ముస్తాబయ్యాయి. బిక్కవోలులోని గోలింగేశ్వరస్వామి ఆలయం, ఊలపల్లి రోడ్డులో కేదారేశ్వరస్వామి, కొంకుదురులోని బుడతల మామిడి వద్ద త్రిముఖ లింగేశ్వరస్వామి, పందలపాకలో కాశీఅన్నపూర్ణా సమేత విశ్వేశ్వరస్వామి, గౌరీశంకరుల తదితర ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరుగనున్నాయి. పెదపూడి మండలం జి.మామిడాడ శివారు ఎల్ఎన్ పురంలో భీమేశ్వరస్వామి, పెదపూడిలో శ్యామలాంబ సమేత సోమేశ్వరస్వామి, దోమాడలో ఉమామాండేశ్వర స్వామి, పుట్టకొండలో భద్రకాళీ సమేత వీరభద్రేశ్వర స్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తారు.

రంగంపేట: రంగంపేటలో 160 ఏళ్ల చరిత్ర ఉన్న ఉమా రామలింగేశ్వర, బాల సుబ్రహ్మణ్యేశ్వర స్వామివార్ల దేవాలయాల్లో శివరాత్రి ఉత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా ఆలయం వద్ద సాయంత్రం స్వామివారికి విఘ్నేశ్వర పూజ, ధ్వజారోహణ, అంకురార్పణ, హోమం, నీరాజన మంత్ర పుష్పం నిర్వహించారు. శనివారం తెల్లవారుజాము నుంచి స్వామివారికి అభిషేకాలు ప్రారంభిస్తారు. ఉదయం 6 గంటలకు పార్వతీ కల్యాణం హరికథ, సాయంత్రం 6 గంటలకు స్వామివారికి ఏకాదశ తదితర 11 రకాల హారతులు, అనంతరం 1008 దీపాలతో సహస్ర దీపారాధన ఉంటుంది. రాత్రి సంగీత విభావరి, సుందర వ్యాసాలు, గిరిజా కల్యాణం, శాస్త్రీయ నృత్య ప్రదర్శన నిర్వహిస్తారు. లింగోద్భవ కాలంలో స్వామి వారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాల అనంతరం కల్యాణం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఆదివారం ఉదయం 10 గంటల నుంచి స్వామి, అమ్మవార్ల గ్రామోత్సవం జరుగుతుంది. రాత్రి 7 గంటలకు పూర్ణాహుతి, శ్రీపుష్పయాగం నిర్వహించనున్నారు.

ముస్తాబైన శైవక్షేత్రాలు

అనపర్తి: శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలో శైవ క్షేత్రాల్లో ఆధ్యాత్మిక శోభ నెలకొంది. మండలంలో చరిత్ర కలిగిన దుప్పలపూడి చంద్రశేఖరస్వామి, పెడపర్తిలో పార్వతీ రామలింగేశ్వరస్వామి, పొలమూరులో పార్వతీ రామలింగేశ్వర స్వామి, అనపర్తి మార్కండేయపురంలోని భావనారుషి ఆలయం, వివిధ గ్రామాల్లో శివాలయాల్లో ఉదయం నుంచీ ప్రత్యేక పూజలు, అర్చనలు జరుగుతాయి.

> **గోకవరం :** కొత్తపల్లిలో సుమారు 300 ఏళ్ల చరిత్ర కలిగిన రెడ్డిరాజుల కాలం నాటి బాలాత్రిపుర సుందరీ సమేత రాజలింగేశ్వరస్వామి ఆలయం ఉంది. ఇక్కడకు వేలాది మంది భక్తులు వచ్చే అవకాశం ఉండడంతో ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. గోకవరం ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న పర్వతవర్ధినీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయం, స్థానిక మురళీనగర్‌లోని సోమేశ్వరస్వామి ఆలయం, రమాసత్యనారాయణస్వామి ఆలయంలో కొలువైన పార్వతీ సమేత గోకర్ణేశ్వరస్వామి ఆలయం, తంటికొండలోని అఖిలాండేశ్వరి సమేత జంబుకేశ్వర స్వామి ఆలయం, కృష్ణునిపాలెంలో విశ్వేశ్వర స్వామి ఆలయాలను రంగులు, విద్యుత్ దీపాలతో అలంకరించారు. తెల్లవారుజాము నుంచి పూజలు, అభిషేకాలు నిర్వహిస్తారు.

ఆకట్టుకున్న ప్రదర్శన

అనపర్తి పాతవూరికి చెందిన వేద పండితుడు రెడ్డి సురేష్‌శర్మ నివాసంలో శుక్రవారం ఏర్పాటు చేసిన శివలింగాకృతుల ప్రదర్శన ఆకట్టుకుంది. మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని సనాతన ధర్మ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో సమితి ప్రతినిధి, సురేష్ శర్మ సోదరుడు సతీష్‌శర్మ రంగవల్లులను తీర్చిదిద్దేందుకు వినియోగించే వివిధ రంగులను, పూలను ఉపయోగించి 9 శివలింగాకృతులను వేశారు.



రంగులు, పూలతో శివలింగాకృతులను తీర్చిదిద్దుతున్న సతీష్‌శర్మ

యువశక్తిని వినియోగించుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి వీసీ ఆచార్య ప్రసాదరాజు

రాజానగరం: దేశంలోని యువశక్తిని సమర్థంగా ఉపయోగించుకుంటూ నూతన ఆవిష్కరణలకు నాంది పలకాలని ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఇన్‌చార్జి ఉప కులపతి ఆచార్య జీవీఆర్ ప్రసాదరాజు అన్నారు. వర్సిటీలోని కాలేజీ ఆఫ్ ఇంజినీరింగ్ ఈఈఈ విభాగం ఆధ్వర్యాన 'రీసెంట్ ట్రెండ్స్ ఇన్ వైర్లెస్ కమ్యూనికేషన్' అనే అంశంపై శుక్రవారం సెమినార్ నిర్వహించారు. 'డిజైన్ అండ్ కంట్రోల్ సిస్టమ్ యూజింగ్ ల్యాబ్ వ్యూ' అనే అంశంపై వర్క్‌షాపు కూడా నిర్వహించారు. తాడేపల్లిగూడెం ఎన్ఐటీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ బి.నరసింహారావు 'రీసెంట్ ట్రెండ్స్ ఇన్ వైర్లెస్ కమ్యూనికేషన్'పై ఉపన్యసించారు. 'డిజైన్ అండ్ కంట్రోల్ సిస్టమ్ యూజింగ్ ల్యాబ్ వ్యూ'పై సీఎస్ఐఆర్, ఐఎంఎంటీ భువనేశ్వర్ ప్రిన్సిపాల్ సైంటిస్టు డాక్టర్ బి.సంతోష్‌కుమార్ ప్రసంగించారు. అనంతరం ఇంటర్న్‌షిప్‌లో ప్రతిభ చూపిన మౌనిక, ఉమమహేశ్వరికి వీసీ సర్టిఫికెట్లు అందజేశారు. రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ గెలుపునకు సమష్టి కృషి

- ప్రజలకు, పార్టీకి మధ్య గృహసారథులే వారధులు
- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

పెదపూడి: ప్రజలకు, వైఎస్సార్ సీపీకి మధ్య వారధులుగా గృహ సారథులు ఉండాలని.. వచ్చే ఎన్నికల్లో సీఎం జగన్ గెలుపునకు కృషి చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి పిలుపునిచ్చారు. జి.మామిడాడలోని ఫ్యామిలీ హెల్త్ క్లబ్‌లో శుక్రవారం మండల సచివాలయాల కన్వీనర్, మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు కర్రి శ్రీవెంకటరెడ్డి అధ్యక్షతన గృహ సారథులకు శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీలు, కులాలు, మతాలు, రాజకీయాలకు అతీతంగా ప్రభుత్వ పథకాలు ప్రతి ఇంటికీ చేర్చడమే లక్ష్యంగా గృహ సారథులు పని చేయాలన్నారు. వలంటీర్లు ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధులైతే.. గృహ సారథులు పార్టీకి ప్రజలకు మధ్య వారధులు అన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు అందుతున్నాయో లేదో చూడాలని, అలాగే పథకాలపై ప్రజలకు వివరించాలన్నారు. గృహ సారథులు ప్రతి ఇంటికి వెళ్లినప్పుడు ఒక స్టిక్కర్ మొబైల్ ఫోన్‌పై, ఇంటి వద్ద అంటించాలన్నారు. అలాగే వారి మొబైల్ ఫోన్‌తో ఒక నంబర్‌కు మిస్డ్ కాల్ ఇవ్వాలన్నారు. సీఎం జగన్ పాలన ఎలా ఉంది, మాజీ సీఎం చంద్రబాబు పాలన ఉందో తెలియజేసే బుక్‌లెట్ ఇంటి పెద్దకు అందించి వివరించాలన్నారు. ఏమైనా సమస్యలుంటే పరిష్కారానికి కృషి చేయాలన్నారు. వేమగిరి నుంచి సామర్లకోట వరకు ఉన్న కెనాల్ రోడ్డును గతంలో ఎందుకు అభివృద్ధి చేయలేదో చంద్రబాబును మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అడగాలని అన్నారు. గ్రాసిం ఇండస్ట్రీకి వ్యతిరేకంగా మాట్లాడుతున్న రామకృష్ణారెడ్డి, గత టీడీపీ హయాంలోనే కేపీఆర్ కంపెనీ అభివృద్ధికి ఎందుకు అనుమతులు ఇచ్చారో చంద్రబాబును ప్రశ్నించాలని ఎమ్మెల్యే డిమాండ్ చేశారు. నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు, మాజీ ఎమ్మెల్యే వరుపుల సుబ్బారావు మాట్లాడుతూ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాణరెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించడానికి గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు కృషి చేయాలన్నారు. పలువురు మాట్లాడుతూ జిల్లాల పునర్విభజనలో భాగంగా పెదపూడి మండలాన్ని రాజమహేంద్రవరం జిల్లాలో కాకుండా పెదపూడి మండలంలో కలిపినందుకు ఎమ్మెల్యేకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఎంపీపీ కేతా తులసి, జెడ్పీటీసీ సభ్యురాలు పేపకాయల వెంకటలక్ష్మి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి అద్దంకి ముక్తేశ్వరరావు, సర్పంచ్ లంక మున్ని, మండల కన్వీనర్ గుత్తుల వెంకటరమణ, వైస్ ఎంపీపీలు ద్వారంపూడి పద్మారెడ్డి, కరెడ్ల వెంకన్నబాబు, పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు కొల్లు పెద్దకాపు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సత్తి భగవాన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణరెడ్డి

భక్తులకు ఇబ్బంది లేకుండా సౌకర్యాలు



బొబ్బిల్లంకలో రోడ్డు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- వంగలపూడి రేవులో ఏర్పాట్ల పరిశీలన

సీతానగరం: మహాశివరాత్రి సందర్భంగా వంగలపూడి రేవు నుంచి ఏలూరు జిల్లా పోలవరం మండలం పట్టిసీమలోని వీరభద్రుని దర్శనానికి వెళ్లే భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నట్టు ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. శుక్రవారం వంగలపూడి రేవు వద్ద ఉత్సవ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో చేస్తున్న వసతులను పరిశీలించారు. టెంట్లు, మరుగుదొడ్లు, తాగునీటి ఏర్పాటుపై ఆరా తీశారు. అనంతరం మాట్లాడుతూ గోదావరి పాయపై వేసిన నడక మార్గంలో ఎటువంటి తోపులాటలు జరగకుండా అన్ని చర్యలు తీసుకున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, పార్టీ మండల కన్వీనర్ ఘంటా శ్రీనివాస్, సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు పెదపాటి డాక్టర్‌బాబు, పార్టీ నాయకులు చల్లమళ్ల సుజీరాజు, కొంచ భాస్కరావు, నీరుకొండ శ్రీనివాస్, అంబటి రమణ, గద్దె వీరన్నబాబు పాల్గొన్నారు.

రోడ్డు పనుల పరిశీలన

రాజమహేంద్రవరం – సీతానగరం ఆర్అండ్‌బీ రోడ్డు పనులను బొబ్బిల్లంక వద్ద ఎమ్మెల్యే జక్కంపూడి రాజా పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ స్లిప్ ఫారమ్ పేపర్ మెషీన్ ద్వారా రోడ్డుపై కాంక్రీట్ వేసే పనులు చేపడుతున్నామన్నారు. నాణ్యత విషయంలో ఎటువంటి రాజీ లేకుండా పని చేయాలని అధికారులు, కాంట్రాక్టర్లకు సూచించారు. ఆర్అండ్‌బీ డీఈ మధుసూదనరావు, వైఎస్సార్ సీపీ నాయకులు మల్లిన చౌదరి పాల్గొన్నారు.

నన్నయ వీసీకి వినతి

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీలో ఉన్నతాధికారులు ఇచ్చిన హామీని అనుసరించి, 2022లో చదువుకున్న హాస్టల్ విద్యార్థులకు 75 శాతం కాషన్ డిపాజిట్టు సొమ్ములు తిరిగి చెల్లించాలని విద్యార్థులు కోరుతున్నారు. ఎస్ఎఫ్ఐ యూనివర్సిటీ కమిటీ కార్యదర్శి డి.అశోక్ కుమార్, నాయకులు కె.గణేష్, జి.మణికంత, పి.సత్య ఆధ్వర్యంలో కొందరు విద్యార్థులు శుక్రవారం ఇన్‌చార్జి వీసీని కలుసుకుని వినతి అందజేశారు.

ధ్యానంతో ఆరోగ్యం

రాజానగరం: నిత్యం ధ్యానం చేయడం ద్వారా మానసిక, శారీరక ఆరోగ్యం, ప్రశాంతత పొందవచ్చని పరమసంత్ మహాత్మా సురేష్ భయ్యాజీ అన్నారు. మండలంలోని తోకాడలో నిర్వహిస్తున్న ఆధ్యాత్మిక కార్యక్రమాలు శుక్రవారంతో ముగిశాయి.

విద్యార్థినుల ప్రతిభ

రంగంపేట: విద్యా, వైజ్ఞానిక ప్రదర్శనలో రంగంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారని హెచ్ఎం వి.పార్థసారథి తెలిపారు. శుక్రవారం స్థానిక హైస్కూల్లో ఆయన మాట్లాడుతూ ఈ నెల 15, 16 తేదీల్లో రాజమహేంద్రవరం శ్రీసత్యసాయి గురుకులంలో నిర్వహించిన జిల్లా స్థాయి విద్యా, వైజ్ఞానిక ప్రదర్శనలో రంగంపేట హైస్కూల్ ప్రథమ స్థానం సాధించి రాష్ట్ర స్థాయికి ఎంపికైందన్నారు. ఐదు అంశాల్లో వందకు పైగా ప్రాజెక్టులు జిల్లా వ్యాప్తంగా విద్యార్థులు ప్రదర్శించారన్నారు. ఎకో ఫ్రెండ్లీ మెటీరియల్‌తో బనానా శానిటరీ నాప్కిన్స్ తయారీలో ఎం.ఆషిక, కాన్ఫిడెన్స్ ఫిల్లింగ్ చైర్ సాఫ్ట్‌వేర్ అండ్ యాప్స్‌లో ఎస్.దివ్య, ఇన్నోవేటివ్ ఎకోసిటీ తయారీలో ఎస్.నాగజాహ్నవిలు ప్రదర్శనలు ఇచ్చి ప్రతిభ చాటారన్నారు. ఈ మేరకు డీఈఓ ఎస్.అబ్రహం సర్టిఫికెట్, జ్ఞాపిక అందించారన్నారు. విద్యార్థినులు ఆషిక, దివ్య, నాగజాహ్నవిలను హెచ్ఎం పార్థసారథి ప్రశంసించారు. వీరు ప్రతిభ కనబరచడానికి కారణమైన గైడ్ ఉపాధ్యాయురాలు రమ్యసుధను హెచ్ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

400 మందికి వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ రమాదేవి తదితరులు

అనపర్తి: రామవరంలో సబ్బెళ్ల సురేష్‌రెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ధాత్రి ఆధ్వర్యంలో శుక్రవారం మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 400 మందికి వైద్య పరీక్షలు చేశారు. అనపర్తి ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి తనయుడు సురేష్‌రెడ్డి 24వ జయంతిని పురస్కరించుకుని సురేష్‌రెడ్డి స్నేహితులు ఆ గ్రామంలోని కల్యాణ మండపంలో ఈ శిబిరం నిర్వహించగా అనపర్తి రమాదేవి హాస్పిటల్ వైద్యులు సేవలు అందించారు. ఏఎంసీ చైర్మన్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ తన కుమారుడు భౌతికంగా లేకపోయినా అతని పేరుపై ట్రస్ట్ ఏర్పాటు చేసి వివిధ సేవలు చేస్తున్నామన్నారు. ఈ శిబిరంలో రమాదేవి హాస్పిటల్ వైద్యురాలు ఎం.రమాదేవి, చెవి, ముక్కు, గొంతు వైద్య నిపుణులు ప్రియారమేష్, జనరల్ సర్జన్ జి.కృష్ణారావు పాల్గొని సేవలు అందించారు. సుమారు రూ.3.50 లక్షల విలువైన మందులను ఉచితంగా పంపిణీ చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. సర్పంచ్ గిరడా గంగాభవాని, ఎంపీటీసీ సభ్యులు నల్లమిల్లి భాగ్యలక్ష్మి, గొలుగూరి గౌతమి, ట్రస్ట్ సభ్యులు చింతా ప్రభాకర్‌రెడ్డి, నల్లమిల్లి శివసాయినాథ్‌రెడ్డి, మల్లిడి శివ కుమార్‌రెడ్డి, పులగం శివారెడ్డి, కర్రి సతీష్ రెడ్డి, నల్లమిల్లి సందీప్‌రెడ్డి పాల్గొన్నారు.